# పరిష్కారం

టెంపోరావ్

నర్సింగ్ హోమ్‌లోని ఏర్‌కండిషన్డ్ కన్సల్టింగ్ రూమ్‌లో కూర్చున్నాను. స్ప్రింగ్ తలుపు తెరిచి ఆమె లోపల కొచ్చింది దగ్గరకు వచ్చి నవ్వుతూ నావంక చూసింది.

ఆమె చెయ్యి పట్టుకుని మెల్లిగా లాగాను. నావైపు పడబోయి ఆమె ఆపుకుంది.

"డ్యూటీ ఫస్ట్!" అందామె, కళ్ళు చిట్లిస్తూ.

నవ్వుతూ ఆమె కళ్ళలోకి చూశాను. తెల్లటి చీర, అదే రంగు జాకెట్ ధరించిందామె తెల్లటి దుస్తుల్లో మల్లె పూవులా అందంగా వుంది. పదేళ్ళ నుంచి నా కామెతో పరిచయమున్నా ఏదో కొత్తదనం నాకు రోజూ ఆమెలో కనిపిస్తూనే వుంటుంది.

నర్సింగ్ హోమ్ గదుల్లో ఎనమండుగురు పేషంట్లు వున్నారు. ఆపరేషన్లు అయ్యాక వాళ్ళు కోలుకొంటున్నారు.

ఆమెతో వెళ్ళి పేషంట్లను చూశాను. ఎవరెవరి కేమి చెయ్యాలో వివరంగా చెప్పాను. ఆమె వేగంగా అంతా రాసుకుంది. పని ముగించి నా కన్సల్టింగ్ రూమ్‌లోకి నడిచాను.

కుషన్డ్ రొటేటింగ్ కుర్చీలో వెనక్కివాలి సిగరెట్ వెలిగించాను. మరోగంట దాకా ఆమె రాదు. తతిమ్మా నర్సులతో ఆమె పనిలో నిమగ్నురాలై వుంటుంది. కొందరు పేషంట్లకు ఇంజక్షన్లు ఇవ్వాలి. మరికొందరికి మందులివ్వాలి.

ఆమెను గురించి ఆలోచిస్తూ కళ్ళు మూశాను. నా మెదడు పదేళ్ళు వెనక్కి దూసుకుపోయింది....

అప్పట్లో నా వయస్సు ఇరవై తొమ్మిది వుంటుంది. ఎమ్.బి.బి.ఎస్. పాసయ్యాను. ఎమ్.ఎస్. కూడా సాధించాను. నా తండ్రి డబ్బున్నవాడు. గోల్డ్‌మన్ సర్జికల్ క్లినిక్ అండ్ నర్సింగ్ హోమ్ స్థాపించాను. గోల్డ్‌మన్ మా ప్రొఫెసర్ ఆఫ్ సర్జరీ. నన్నెంతో ఆప్యాయంగా చూసేవాడు.

నా మూలంగా వేలాది రోగులకు మేలు గలుగుతుందని గర్వించేవాడిని. సర్జన్‌గా, ఫిజీషియన్‌గా గొప్ప పేరు సంపాదించాలని నా ఆశ.

ఆరోజు ఆదివారం. నా మిత్రుడు రాజారామ్ తన యింట్లో ఇచ్చిన డ్రింక్స్ పార్టీకి వెళ్లాను. స్కాచ్ విస్కీ ధారాళంగా సేవించాం. నేను బయటపడేసరికి పదకొండు కావస్తోంది.

రోడ్లో లైట్లు డిమ్‌గా వెల్గుతున్నాయి. ఫియట్ కారును వేగంగా యింటివైపు పోనిస్తున్నాను. కళ్ళు చెదురుతున్నాయి. చాలా నిషాగా వుంది. కాని ఎంతో ఉషారుగా వుంది. గాలిలో ఎగురుతున్నట్లు అనిపిస్తోంది.

చటుక్కున బ్రేకు నొక్కాను. కారు హఠాత్తుగా ఆగింది. నేను ముందుకు పడి, లేచి, సర్దుకున్నాను.

కారు ముందునున్న యువతివంక ఆశ్చర్యంగా చూశాను. ఆమె కిటికీ పక్కకు వచ్చింది. ఆమె ముఖంలో గాభరా గోచరిస్తోంది. "సార్, నా బిడ్డ ప్రమాదంలో వున్నాడు. ఏ డాక్టర్‌నేనా పిల్చుకురాగలరా?" అందామె ఖంగారుగా.

"నేను డాక్టర్నే," అన్నాను.

ఆమె కళ్ళు మెరిశాయి.

"నా బాబు అదృష్టవంతుడు. మా యింటి కొచ్చి వాడిని చూడండి." అంది ఆమె.

ఆమెను కార్లో కూర్చోచున్నాను. సమీపంలో వున్న వీధిలోకి కారును పోనిచ్చి, ఆమె చూపించిన ఇంటిముందు కారాపి దిగాను.

చిన్న యిల్లు. పిట్టగేటును ఆమె తెర్చింది. నా కిట్ బాగ్ పట్టుకుని లోపలకు వెళ్ళాను. హాల్లో వుయ్యాల్లో వున్న బిడ్డను పరీక్షించాను. హై టెంపరేచర్!

వెంటనే నా కిట్ బాగ్ తెరిచి ఆమె బిడ్డకు తుంటిమీద యింజక్షన్ ఇచ్చాను. అతడికి ఐదో నెల వచ్చుంటుంది.

"జ్వరం ఎన్నిరోజుల్నించి ఉంది?"

"మూడు రోజుల్నించి సార్," అందామె.

"ఇంతవరకూ డాక్టర్ని ఎందుకు పిలవలేదు?" అన్నాను కోపంగా.

"తగ్గిపోతుందనుకున్నాను. వూపిరాడక వాడు తన్నుకుంటున్నాడు. భయపడి బయటకు పరుగెత్తాను," అందామె.

నా కళ్ళు ఆమెమీద కేంద్రీకృతమైనాయి. కోలముఖం. విశాల నేత్రాలు. తీర్చిదిద్దిన ముక్కు. ఎర్రటి పెదిమలు. నా చూపు కిందకు దిగింది. పాలతో బరువెక్కిన స్తనాలవైపు చూసి, అమాంతంగా కళ్ళు మూసుకున్నాను.

కళ్ళు తెర్చాను. ఇంకా నాకు నిషాగా వుంది. సమీపంలో వున్న కుర్చీలో కూలబడ్డాను. ఆమెవైపు మళ్లా చూశాను. బంగారం బొమ్మలా వుందామె.

ఆమె లోపలకు వెళ్ళబోయింది.

"నీ పేరు?"

"సుమిత్ర."

"నీ భర్త ఏం చేస్తున్నారు?"

"రాజా కెమికల్స్ ఫ్యాక్టరీలో ఆయన సెక్యూరిటీ ఆఫీసర్‌గా వుంటున్నారు. పన్నెండు దాటాక ఆయన యింటికి వస్తారు," అందామె.

టైం చూశాను. పదకొండున్నర అయింది. ఆమె లోపలకు పరుగెత్తింది. నా మనోఫలకంమీద ఆమె రూపం



నృత్యం చేస్తోంది. ఏదో కోరిక నన్ను ఆవరించింది. నా మెదడును కప్పిన నిషా ఆ కోర్కెను రెచ్చగొట్టింది. నా కోర్కెను తీర్చుకోవాలి!

హాలు గుమ్మంవైపు చూశాను. మెల్లిగా వెళ్ళి తలుపు మూసి, గడియ పెట్టాను. వుయ్యాలవైపు తిరిగాను. ఆమె బిడ్డ నిద్రపోతున్నాడు. తూల్తూ లోపలి గదిలోకి వెళ్ళాను. కిరసిన్ స్టవ్ పక్కనే ఆమె కూర్చుని వుంది.

వెనుతిరిగి నా వైపు నవ్వుతూ చూసింది.

"దేవుడిలా వచ్చి నా బిడ్డను కాపాడారు. మీకోసం కాఫీ చేస్తున్నాను. వెళ్ళి కూర్చోండి, తెస్తాను," అందామె.

చిలిపిగా నవ్వుతూ ఆమెవైపు జరిగాను. వెనుకనుంచి కింద కూర్చున్న ఆమెను బలంగా పట్టుకున్నాను. ఆమె గింజుకుంది భయంతో నావైపు చూసింది.

ఆ క్షణంలో నేనొక పిశాచంలా ప్రవర్తించాను. యవ్వనంలో వున్నాను. బలమైన మనిషిని. ఆమె నన్ను ఆపలేకపోయింది. స్టవ్ మండుతోంది, నాలోని కామాగ్నిలా. ఐదునిమిషాల్లో అంతా అయిపోయింది. ఆమె నా కామవాంఛకు బలైపోయింది.

లేచాను. ఆమె నా మీదకు హేయంగా ఉమ్మింది. ఏదో భయం! గబగబా బయటకు పరుగెత్తాను. కారును వేగంగా పోనిచ్చాను. ఆమె నా కారు నంబర్ని చూసి వుండదు. ఆమెనుంచి దూరంగా పోవాలి! ఏవేవో ఆలోచనలు!

టైమ్ పన్నెండు కావస్తోంది. నిర్మానుష్యంగా వున్న మెడోస్ రోడ్డమ్మట కారును పోనిస్తున్నాను. ఎవడో తప్ప తాగినవాడు రోడ్డుమధ్యన తూల్తూ నడుస్తున్నాడు. బ్రేక్ నొక్కి కారాపాను.

రోడ్డు పక్కనుంచి మరొకడు నా వైపు దూసుకొచ్చాడు. తలుపు తెరిచి నన్ను బయటికి లాగాడు. అంతవరకూ తూల్తున్నతడు నావైపు వచ్చాడు. "వున్నదంతా లాక్కుని వాడిని పొడి చేయి!" అర్చాడతను.

నా జేబులోని పర్సును వాళ్ళు లాక్కున్నారు. మెరుస్తున్న కత్తివైపు భయంతో చూశాను.

"తొందరగా కానీ!" అన్నాడొకడు.

"నన్ను చంపకండి! వున్నదంతా మీకు ముట్టిందిగా!" బ్రతిమాలాను. "ఈ దొంగ నాకొడుకు మన్ని చూశాడు. పోలీస్ రిపోర్టిస్తాడు. పొడిచి ఈ కారులోనే పాతిపోదాం!" అన్నాడతను.

నా గుండె దడదడలాడ్తోంది. విస్కీ నిషా కొంతవరకు తొలగిపోయింది. ప్రాణభయం నన్ను ఆవరించింది. సుమిత్ర వుసురు నన్ను కొడ్తుందేమో!

ఎవరో సైకిల్మీద వస్తున్నాడు. గట్టిగా అర్చాను. సైకిల్ వ్యక్తి వాళ్ళ మీదకు దూకాడు. వాళ్ళతో కలియబడ్డాడు. ఇద్దరితోనూ అతడు ధైర్యంగా పోరాడాడు. చలనంలేనట్లు నే నుండిపోయాను.

భయంకరమైన కేక గాలిలో ధ్వనించింది. వాళ్ళిద్దరూ పారిపోయారు. నేలమీద పడున్న వ్యక్తి దగ్గరకు వెళ్లాను. అతడు బాధతో మూల్గుతున్నాడు. కారు హెడ్లైట్ల కాంతిలో అతడిని పరీక్షించాను. అతడిని గుండెల్లో కత్తితో పొడిచి వాళ్ళిద్దరూ మాయమయ్యారు.

అతడిని మెల్లిగా తీసుకెళ్ళి కార్లో పడుకోబెట్టాను. కారును శరవేగంగా నా సర్జికల్ క్లినిక్వైపు పోనిచ్చాను.

బాగా రక్తం పోయింది. అతడిని బ్రతికించడానికి శాయశక్తులా ప్రయత్నించాను. ఆనాటి రాత్రి నాకు నిద్ర లేదు!

టైమ్ మూడవుతోంది. నర్స్ లిల్లీ నా గదిలోకి పరుగెత్తుకొచ్చింది. "డాక్టర్ ఆయన్ని మీరు వెంటనే వచ్చి చూడాలి," అందామె.

అతడి గదిలోకి వేగంగా వెళ్ళాను. కొనవూపిరితో వున్నాడతను. మెల్లిగా నా చెయ్యి పట్టుకున్నాడు.

"నా భార్యను .... చూడాలి ....

చూడాలి," అన్నాడతను, ప్రతి పదాన్ని బాధతో ఉచ్చరిస్తూ.

మీ భార్య పేరు, అడ్రస్ చెప్పండి," అన్నాను.

అతడు మెల్లిగా చెప్పాడు. వులిక్కిపడ్డాను. వెయ్యి సుత్తులతో నా తలమీద బాదుతున్నట్లు అనిపించింది. మరుక్షణంలో అతడు గిజ గిజ కొట్టుకుంటూ శాశ్వతంగా కళ్ళు మూశాడు. తల పక్కకు వాలిపోయింది.

నా గదిలోకి వెళ్ళిపోయాను. తల తిరుగుతోంది. సుమిత్ర! అతడామె భర్త! సుమిత్రను నేను బలాత్కరించి నా కోర్కె తీర్చుకున్నాను. ఇంటికి పోతూ ఆమె భర్త నన్ను కాపాడాడు! నన్ను రక్షించడంకోసం తన ప్రాణాన్ని త్యాగం చేశాడు.

వెక్కి వెక్కి ఏడుస్తూ వుండిపోయాను. ఈ పరిస్థితిలో నేనేం చెయ్యాలి? చావాలి! నేను చస్తే నన్ను వేధించే ఈ బాధ అంతమవుతుందా? భగవాన్! నా కర్తవ్య మేమిటి?

నిమిషాలు గడిచిపోయాయి. ఆలోచనల్తో నా మెదడు వేడెక్కింది. టైమ్ చూశాను. నాలుగు దాటింది.

గదిలోంచి బయటకు నడిచి కారులో కూర్చుని తలుపు మూశాను. కారును వేగంగా పోనిచ్చాను.

కారు దిగి లోపలకు వెళ్ళాను. హాల్లో లైటు వెలుగుతోంది. నేలమీద సుమిత్ర కూర్చుని వుంది, ఆమె ఒళ్లో బిడ్డ!


ఆమె నావైపు కోపంగా చూసింది. "చేసింది చాలక, మళ్లా వచ్చావా?" అర్చిందామె.

నేలమీదపడి ఆమె పాదాలను పట్టుకున్నాను. "జరిగిందానికి క్షమించు. ఒళ్లు తెలియని స్థితిలో ఏదో చేశాను!" అన్నాను.

"నా జీవితాన్ని ధ్వంసం చేశావు. నా భర్తకు ఈ పాడు ముఖాన్ని ఎలా చూపగలను?" అందామె.

నా కళ్ళు నీళ్ళతో నిండాయి. "నీ భర్త నీ ముఖాన్నిక చూడలేడు! అతడు నా నర్సింగ్ హోమ్‌లో మరణించాడు," అన్నాడు.

ఆమె కెవ్వున అర్చింది. జరిగినదంతా ఆమెతో చెప్పాను. "సుమిత్రా, నేను దుర్మార్గుడిని. నీ భర్త నన్ను రక్షించి, వాళ్ళ కత్తిపోటుకు బలైపోయాడు. నైతికంగా అతడిముందు నే నెంత అల్పుడినో తెలుసుకున్నాను.



నువ్వు ఏ శిక్ష విధించినా నేను అనుభవిస్తాను," అన్నాను.

ఏడుస్తూ ఒళ్లో ఉన్న పాపను పట్టుకుని ఆమె తృళ్ళిపడింది. బిడ్డను పరీక్షించాను.

"నీ బిడ్డ కూడా తండ్రితో వెళ్ళిపోయాడు!" అన్నాను దుఃఖంతో.

ఒళ్ళో ఉన్న బిడ్డను పైకెత్తి ఆమె ముద్దెట్టుకుంది. ఆమె పాదాలముందు మౌనంగా వుండిపోయాను.

అటుపైన ఆమెను ప్రతిరోజూ చూసేవాడిని. ఆమె అందం, అమాయకత్వం నన్నెంతగానో ఆకర్షించేయి

ఒకనాడు ఆమెవైపు ఆప్యాయంగా చూశాను. "సుమిత్రా నువ్వు సమ్మతిస్తే మనం రిజిస్టర్ మేరేజి చేసుకుందాం," అన్నాను.

ఆమె అదోలా నవ్వింది. "నువ్వు చేసిన పాపానికి ప్రాయశ్చిత్తంగా నన్ను పెళ్లాడాలనుకుంటున్నావా?"

"కాదు!"

"నేను ఒంటరిదాన్నయేనని జాలిపడి నన్ను పెళ్లాడవచ్చావా?"

"నేను నిన్ను ప్రేమిస్తున్నాను."

"నీ ప్రేమలో నా కింకా నమ్మకం లేదు." అందామె.

ఆమెవైపు సూటిగా చూశాను.

"నీలో పూర్తిగా విశ్వాసం కలిగే దాకా నేను వేచి వుండగలను," అన్నాను వుద్రేకంతో.

సంవత్సరం తర్వాత ఆమె సమ్మతించింది. మా వివాహం జరిగింది.

ఎవరో గదిలో కొచ్చారు గతంలోంచి బయట పడ్డాను. ఎదురుగా వున్న సుమిత్రవైపు నవ్వుతూ చూశాను.

ఆమె నా పక్కకి వచ్చి టేబిల్‌మీద కూర్చుంది. ఆమె కళ్ళలోకి ప్రేమతో చూశాను.

"సుందర్, ఏమిటలా వున్నావు?" అడిగిందామె.

"గతం గుర్తుకొచ్చింది," అన్నాను.

ఆమె తియ్యగా నవ్వింది.

"గతాన్ని మర్చిపో! మనిషై పుట్టాక తప్పులు చేస్తాం. నువ్వు చేసిన తప్పుకు నువ్వెంతగానో బాధపడ్డావు నీ జీవిత మార్గాన్ని మార్చుకున్నావు." అందామె.

ఆమె చెయ్యి పట్టుకున్నాను. ఆమె కళ్ళల్లోకి కృతజ్ఞతతో చూశాను. ఒకనాడు నాలో విహరించిన పశువును మనిషిగా మార్చిన ఆమెవైపు చూస్తూ వుండిపోయాను.

"మై డియర్, నువ్వు చాలా గొప్పదానివి," అన్నాను వుద్రేకంతో.

